తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ బుధవారం 30 - 04 - 2025 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని..





విలపిస్తూ తన గోడును వెల్లబోసుకుంటున్న బాధితుడు కనకయ్య

# వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఘటన
- ఓ కాంగ్రెస్ లీడర్‌కు రూ.20 వేలు ఫోన్ పే కొట్టానంటున్న బాధితుడు

ప్రజావారధి/మోత్కూరు

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదన్న మనస్థాపంతో ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వెలుగుపల్లి గ్రామానికి చెందిన బయ్య కనకయ్య ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో కనకయ్య పేరు రాలేదు. దీంతో నిరుపేదనైన తనకు ఇల్లు మంజూరు కాకపోవడంతో మనస్థాపం చెందిన కనకయ్య మంగళవారం ఉదయం గ్రామంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ఎక్కాడు. ఇల్లు మంజూరు కాకుంటే ఆత్మహత్య చేసుకుంటానని, తనకు ఇందిరమ్మ ఇల్లు చేసే వరకు ట్యాంక్ దిగేది లేదని భీష్మించాడు. దీంతో విషయం పోలీసులకు తెలియడంతో పోలీసులు వచ్చి అతనికి నచ్చజెప్పి కిందకు దించారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఓ కాంగ్రెస్ లీడర్‌ను కోరగా రూ.50 వేలు అడిగారని, తాను అంత ఇవ్వలేనని వేడుకోగా, మిగతా వాళ్లు రూ.లక్ష వరకు ఇస్తున్నారని చెప్పగా తాను రూ.20 వేలు ఆ నాయకునికి ఫోన్ పే చేశానని బాధితుడు కనకయ్య ఆరోపించారు. అయినా తనకు ఇల్లు మంజూరు కాలేదని బాధితుడు వాపోయాడు. డబ్బులు తీసుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలతో ఈ ఘటన హాట్ టాపిక్‌గా మారింది.


తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



## మరో ఫ్యామిలీకి అండగా నిలిచిన..

# మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్

## ❑ సైనస్ సర్జరీకి రూ.19 వేల సాయం అందజేత




ప్రజావారధి/మోత్కూరు

సోషల్ మీడియాను వేదికగా చేసుకుని కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు మరో ఫ్యామిలీకి చేయూత నిచ్చింది. మోత్కూరు మండలం పనకబండ గ్రామానికి చెందిన పొన్నెబోయిన సాయితేజ్ సైనస్ సమస్యతో బాధపడుతుండగా సర్జరీ చేయించగా ఆపరేషన్ ఫెయిల్ అయ్యింది. మళ్లీ అతనికి ఆపరేషన్ చేయించాల్సి రావడంతో ఆ నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా స్పందించిన మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యులు, దాతల నుంచి రూ.19 వేలు సేకరించారు. మంగళవారం బాధితుని తండ్రి కృష్ణకు గ్రూపు ప్రతినిధులు మోత్కూరులో రూ.19 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ గనగాని నర్సింహ మాట్లాడుతూ వాట్సాప్ గ్రూపు ద్వారా ఇప్పటి వరకు 150 కుటుంబాలకు పైగా ఆర్థిక సాయం అందజేసి చేయూతనివ్వడం అభినందనీయమని, గ్రూపు సభ్యులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. సామాజిక సేవకు వాట్సాప్ గ్రూపును వేదిక చేయడం స్ఫూర్తిదాయకమని, సామాజిక సేవా కార్యక్రమాలను ఇలానే ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. సామాజిక సేవకు మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఎండి.సమీర్, వాట్సప్ గ్రూప్ ప్రతినిధులు దబ్బెటి సోంబాబు, కారుపోతుల వెంకన్న, గాదె వెంకటేశ్వర్లు, ఇంద్ల రాంప్రసాద్, మొరిగాల శ్రీనివాస్, కోమటి జనార్ధన్, కడమంచి రమేష్, మురారి శెట్టి శ్రీనివాస్, పురుగుల నర్సింహ, మెంట నగేష్ ,కురుమిళ్ల రాములు, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గంగదేవమ్మ ఆలయానికి విరాళం అందజేత

ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండలం తక్కళ్లపహాడ్ గ్రామంలో మూడు రోజులు గంగ దేవమ్మ ఆలయంలో కళ్యాణోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కట్టంగూరి మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం కమిటీ సభ్యులకు మంగళవారం రూ.10116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్, చింత ధనుంజయ్, చెరుకు జానయ్య, తోటకూరి పరశురాములు పాల్గొన్నారు.

